

అక్టోబరును రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా జరుపుకొంటున్న నేపథ్యంలో ఓమందూర్ ప్రభుత్వ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహించిన అవగాహన ప్రదర్శనలో పాల్గొన్న ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రి నర్సులు - న్యూస్‌టుడే, ఆర్కేనగర్



సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సత్యబ్రత సాహు, పార్టీల ప్రతినిధులు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమాలోచన

చెన్నై: ఓటరు జాబితా సవరణ రానున్న 29న జరగనున్న నేపథ్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సత్యబ్రత సాహు సచివాలయంలో గురువారం సమాలోచన నిర్వహించారు. ఓటరు జాబితాలో ప్రత్యేక సవరణలకు ఉపయోగించాల్సిన ఫారాల వివరాలు వెల్లడించారు. పార్టీల ప్రతినిధుల సూచనలు, అభిప్రాయాలను పరిశీలనకు తీసుకున్నారు.

ఈనాడు–చెన్నై

పైలెట్ల తయారీకి సై

- కోవిల్‌పట్టిలో ప్రత్యేక హబ్ ఏర్పాటు
- శిక్షణ కేంద్రాల రాకకు అవకాశం
- అనువైన స్థలం ఎంపిక చేసిన టిడ్కో

దేశంలో విమానయానరంగంలో పైలెట్ల కొరత వేధిస్తోంది. దీన్ని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం సైతం ప్రయత్నాలు మొదలు పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం అడుగు ముందుకేసి పైలెట్ల రాకకు సుగమం చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పైలెట్లుగా మారేవారికి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. కోవిల్‌పట్టిని అందుకు వేదికగా మారుస్తోంది.

తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి సమీపంలో రానున్న రోజుల్లో వివిధ రకాల విమానాల చక్కర్లు కొట్టనున్నాయి. ఇలా ఒకరోజు కాదు.. ఏడాది పొడవునా తిరగనున్నాయి. విమానయాన రంగంలో పైలెట్లకు శిక్షణ ఇచ్చే ప్రత్యేక కేంద్రాలు ఇక్కడ ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాంతాన్ని పైలెట్ల శిక్షణకు హబ్‌గా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందుకు సంబంధించి ఫ్లైయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్(ఎఫ్‌టీవో)ను ఇక్కడ సిద్ధం చేస్తోంది. ఇందుకోసం కోవిల్‌పట్టి నుంచి 6 కి.మీ. దూరంలోని నాలాట్టిన్‌పుదూర్, తోణుగాల్ గ్రామాల పరిధిలో 68 హెక్టార్ల స్థలాన్ని ఎంపిక చేసింది.

అక్కడే ఎందుకు?..


తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి సమీపంలోనే ఈ పైలెట్ ప్రాజెక్టుకు స్థలాన్ని ఎందుకు ఎంపిక చేశారనే సందేహం రావొచ్చు. ఇందుకు అధికారులిస్తున్న వివరణ ఆసక్తి రేపుతోంది. ఈ పరిసర ప్రాంతాల్లో విమానాల రాకపోకలు బాగా తక్కువ. పైలెట్లకు శిక్షణ ఇచ్చేందుకు అనువైన వాతావరణం కనిపిస్తోంది. ఓ ప్రైవేటు మిల్‌కు చెందిన యజమాని తన ప్రైవేటు విమానం కోసం ఇదివరకే ఓ రన్‌వేని ఇక్కడ ఏర్పాటుచేసి ఉండటం తదితర అంశాలు సానుకూలంగా ఉన్నట్లు కనిపిస్తున్నాయి. ఈ రన్‌వేనే శిక్షణకూ వాడనున్నట్లు వెల్లడించారు.

పైలెట్ల కొరత ఎక్కువే..

సెంటర్ ఫర్ ఆసియా పసిఫిక్ ఏవియేషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం.. దేశంలో ఈ దశాబ్దకాలంలో 18వేల పైలెట్ల అవసరం ఉంటుందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. కొందరు విదేశాలకు వెళ్లడం, మరికొందరు పదవీ విరమణ పొందడం తదితర కారణాలతో ఈ కొరత మరింత పెరుగుతోందని అన్నారు. దేశంలో పైలెట్ల శిక్షణకు సరైన వసతులు లేనికారణంగా.. కొరతను అధిగమించలేక పోతున్నట్లు నిపుణులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం ఏడాదికి 600 మంది మాత్రమే దేశంలో తయారవుతున్నారని, మరికొందరిని విదేశాల నుంచి రప్పిస్తున్నట్లు వివరిస్తున్నారు.

డీపీఆర్ పూర్తి

ప్రాజెక్టుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు ఏజెన్సీని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం టెండర్లను ఆహ్వానిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు తమిళనాడు పారిశ్రామికాభివృద్ధి సంస్థ(టిడ్కో) నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. దీని ఆధ్వర్యంలో ప్రాజెక్టును పూర్తిచేసేలా నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు డీపీఆర్ పూర్తయినట్లు అధికారులు ప్రకటించారు.



రాష్ట్రంలో ప్రతిపాదిత ప్రాంతం

10 విమానాలు ఉండేందుకు..

కోవిల్‌పట్టిలోని రన్‌వేను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పునర్నిర్మించనున్నారు. ఇది 1.2 కి.మీ. పొడవు, 15మీ వెడల్పుతో ఉన్నట్లు అధికారులు తెలిపారు. 20 ఏళ్లుగా ఉన్న ఈ రన్‌వేని ప్రస్తుతం వాడట్లేదు. ఇక్కడే శిక్షణ కేంద్రానికి అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుబంధంగా ఉండే స్థలంలో 10 శిక్షణ విమానాల్ని నిలుపుకొనేలా వసతులు కల్పించుకోవచ్చని వివరించారు.





వివిధ ప్రాంతాల్లోని శిక్షణ కేంద్రాలు

రాష్ట్రంలో మొదటిది..

అధికారుల గణాంకాల ప్రకారం దేశంలో 35 ఎఫ్‌టీవోలు పనిచేస్తున్నాయి. వాటికి 50 శిక్షణ బేస్‌లున్నాయి. తమిళనాడుకు ఇప్పటి దాకా ఒక్కటికూడా మంజూరు కాకపోగా.. కోవిల్‌పట్టిలో ఏర్పాటు చేస్తున్నది మొదటి అవుతోంది. గతంలో హైదరాబాద్‌కు చెందిన హెర్క్యులస్ ఏవియేషన్ సంస్థ ఎఫ్‌టీవోను సేలంలో ఏర్పాటు చేయాలని అనుకుంది. ఆ తర్వాత సాంకేతికత కారణాలతో నిర్ణయాన్ని మార్చుకుని మహారాష్ట్రలోని లాతూర్‌లో ఏర్పాటుచేసింది. చెన్నైకి చెందిన ఓరియంట్ ఏవియేషన్ అకాడెమీ మైసూరులో ఎఫ్‌టీవో నడుపుతోంది. రాష్ట్రంలో కళ్లకురిచ్చిలోని ఉలుందూర్‌పేటలో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనుకుని అనంతరం తప్పుకొంది. రాష్ట్ర ప్రభుత్వమే టిడ్కో ద్వారా శిక్షణ కేంద్రాన్ని తెరిచేందుకు ముందుకొచ్చింది.

ఆమ్నీ బస్సుల్లో అదనపు ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: అదనంగా ఛార్జీలు వసూలు చేసే ఆమ్నీ బస్సులపై చర్యలు తీసుకుంటామని రవాణాశాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. దీపావళి సందర్భంగా బస్సు ఛార్జీలకు సంబంధించి ఆమ్నీ బస్సుల యజమానులతో చెన్నై గిండిలోని రవాణాశాఖ కార్యాలయంలో మంత్రి నేతృత్వంలో గురువారం సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతేడాది కంటే ఈసారి తక్కువ సంఖ్యలోనే ప్రజలు రిజర్వేషన్ చేసుకున్నారని బస్సుల యజమానులు తెలిపారన్నారు. గత రెండేళ్లలా ఛార్జీలు పెంచకుండా నడుపుతారని చెప్పారు. ఆమ్నీ బస్సులు టోల్‌గేట్లో నిలవకుండా నడిపేలా చర్యలు జరుగుతున్నాయని చెప్పారు. వెలుగుల పండుగకు ప్రభుత్వం అదనంగా బస్సులు నడుపుతోందన్నారు. ప్రైవేట్ బస్సులు నడిపేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని, అందులో భాగంగా కి.మీ.కు రూ.51 నిర్ణయించినట్లు తెలిపారు. దీపావళికి వెయ్యి ప్రైవేట్ బస్సులు సిద్ధంగా ఉంచాలని చెప్పామన్నారు. విళుపురం జోన్‌లో రవాణసంస్థ తరఫున ప్రైవేట్ బస్సులు నడపనున్నామని వివరించారు.

అన్నాడీఎంకే ఆందోళన 26న

సైదాపేట, న్యూస్‌టుడే: మైలాడుదురై జిల్లా ప్రధాన ఆస్పత్రిలో సిబ్బంది, మందుల కొరతతో రోగులకు చికిత్స అందించలేని పరిస్థితి నెలకొందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి గురువారం ప్రకటనలో తెలిపారు. అవసరమైన చర్యలు తీసుకోని డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ 26న ఉదయం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేయనున్నట్లు పేర్కొన్నారు.



ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, పక్కన మంత్రి పొన్ముడి తదితరులు

ట్రెక్ తమిళనాడు ప్రారంభం

ప్యారిస్, న్యూస్‌టుడే: ట్రెక్ తమిళనాడు పథకాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ గురువారం సచివాలయంలో ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన లోగో విడుదల చేశారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు www.trektamilnadu.com వెబ్‌సైట్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలో 40 సుందరమైన ట్రెక్కింగ్ మార్గాలు ఉన్నాయన్నారు. అటవీశాఖ మంత్రి పొన్ముడి, పర్యావరణం, వాతావరణ మార్పులు, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి సెంథిల్‌కుమార్ పాల్గొన్నారు.

శివగంగై సీమధీరులు.. మరుదు సోదరులు

చెన్నై, న్యూస్‌టుడే: విదేశీయుల ఆధిక్యతకు వ్యతిరేకించి పోరాడిన శివగంగై సీమధీరులు మరుదు సోదరులను కీర్తిస్తున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. మరుదు సోదరుల వర్ధంతి సందర్భంగా ఆయన తన 'ఎక్స్' పేజీలో... స్వాతంత్ర్యం, త్యాగానికి గుర్తుగా మరుదు సోదరులు జీవించారన్నారు. వారి పోరాటం, ధీరత్వం ప్రజల మనస్సుల్లో ఎన్నటికీ జీవించి ఉంటుందని పేర్కొన్నారు. **చెన్నై:** గిండి గాంధీ మండపం ప్రాంగణంలోని మరుదు సోదరుల విగ్రహాల వద్ద రాష్ట్ర ప్రభుత్వం తరఫున నివాళి అర్పించారు. మరుదు సోదరుల చిత్రపటానికి మంత్రులు సామినాథన్, సుబ్రమణియన్, పీకే శేఖర్‌బాబు, మహానగర చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ, ఎమ్మెల్యేలు ప్రభాకరరాజా, అధికారులు పుష్పాంజలి ఘటించారు. **చెన్నై:** రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన చిత్రపటానికి గవర్నర్ ఆర్.ఎన్.రవి నివాళులర్పించారు. తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి కూడా ఆయన నివాళులర్పించారు. తన 'ఎక్స్' సందేశంలో... మరుదు సోదరులు దార్శనిక నాయకులుగా, అసాధారణ పరిపాలకులుగా ఉన్నారని కొనియాడారు. తుదిశ్వాస వరకు బ్రిటీషువారికి వ్యతిరేకంగా పోరాడారన్నారు.





మరుదు సోదరుల చిత్రపటానికి ప్రభుత్వం తరఫున నివాళులర్పిస్తున్న దృశ్యం ● రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్.ఎన్.రవి..

డ్రైవరు రహిత మెట్రో రైలు ట్రయల్ రన్ 26న

టీనగర్, న్యూస్‌టుడే: చెన్నైలో డ్రైవరురహిత మెట్రో రైలు త్వరలో పరుగులు పెట్టనుంది. ఇప్పటికే బోగీలు సిద్ధమైన నేపథ్యంలో 26న ట్రయల్ రన్ నిర్వహించేందుకు సీఎంఆర్‌ఎల్ ఏర్పాటు చేస్తోంది. చెన్నైలో మూడు మార్గాల్లో మెట్రో రైలు ప్రయాణానికి పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. రూ.63,246 కోట్లతో మాధవరం పాలకేంద్రం నుంచి చిరుచ్చేరి వరకు(45.4 కి.మీ), మెరీనా తీరాన లైట్‌హౌస్ నుంచి పూందమల్లి బస్ డిపో వరకు (26.1కి.మీ), మాధవరం నుంచి షోళింగనల్లూర్ వరకు (44.2 కి.మీ.) పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం డ్రైవరు రహిత రైళ్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. మూడు కోచ్‌లతో ఓ రైలు వంతున 36 రైళ్లు పరుగులు తీయనున్నాయి. కోచ్‌ల తయారీకి సీఎంఆర్‌ఎల్ అల్‌స్టోమ్ ట్రాన్స్‌పోర్ట్ ఇండియా సంస్థతో రూ.1,215.92 కోట్లకు ఒప్పందం కుదుర్చుకుంది. ఫిబ్రవరి నుంచి కోచ్‌ల తయారీ మొదలవగా సెప్టెంబరు 22తో మొదటి రైలు తయారీ పనులు పూర్తయ్యాయని సీఎంఆర్‌ఎల్ వెల్లడించింది. ట్రయల్ రన్ నిర్వహించేందుకు తొలి రైలును చెన్నై పూందమల్లికి చేర్చారు.



హోరాహోరీగా రాబోయే అసెంబ్లీ ఎన్నికలు

● తమిళిసై సౌందరరాజన్

సైదాపేట, న్యూస్‌టుడే: రాబోయే అసెంబ్లీ ఎన్నికలు డీఎంకే అనుకుంటున్నట్లు అంత సులభంగా ఉండవని భాజపా నేత తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. గురువారం విలేకర్లతో మాట్లాడారు. గవర్నర్ పాల్గొనే సాధారణ, ప్రభుత్వ కార్యక్రమాలను బహిష్కరించినా ఫర్వాలేదని, స్నాతకోత్సవాలకు మంత్రి గైర్హాజరవటం మంచిది కాదన్నారు. ఇవి రాజకీయాలకు అతీతంగా జరిగేవన్నారు. అక్కడ డిగ్రీలు అందుకునే విద్యార్థులకు దిశానిర్దేశం చేసేందుకు మంత్రి ప్రసంగించాల్సి ఉంటుందని చెప్పారు. డీఎంకే అన్నింటినీ రాజకీయంగా చూస్తోందని చెప్పారు. తమను ఓడించేవారు లేరనేలా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతున్నారని తెలిపారు. కూటమిలో విభేదాలు లేవని, వివాదం మాత్రమే ఉందని ముఖ్యమంత్రి స్టాలిన్ చెబుతున్నారన్నారు. ముఖ్యమంత్రి అయ్యేలా తమ కార్యకలాపాలు ముమ్మరం చేయాలని తిరుమావళవన్ పార్టీ శ్రేణులకు చెబుతున్నారని, పాలనలో కాంగ్రెస్ భాగస్వామ్యం కోరే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలు హోరాహోరీగానే ఉంటాయన్నారు. ఎవరు గెలిచినా కూటమి ప్రభుత్వంగా ఉంటుందనేది తన అభిప్రాయమని తెలిపారు.



పొన్నేరిలో ఆగిన రైలు



పట్టాలపై ఏర్పడిన పగుళ్లు

పట్టాలపై పగుళ్లు..

రైళ్ల రాకపోకలకు ఆటంకం

పొన్నేరి, న్యూస్‌టుడే: చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి మధ్య రోజుకు 50కి పైగా సబర్బన్ రైళ్లు తిరుగుతున్నాయి. పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళ్తున్నాయి. ఈ మార్గంలోని అనుపంపట్టు-మీంజూరు మధ్య గురువారం మరమ్మతులు చేపట్టారు. ఉదయం 11.30 సమయంలో అనుపంపట్టు సమీపాన పట్టాలపై పగుళ్లను సిబ్బంది గుర్తించారు. వారు గుమ్మిడిపూండి రైల్వేస్టేషన్‌కు సమాచారం అందించడంతో గుమ్మిడిపూండి నుంచి చెన్నై సెంట్రల్ వెళ్తున్న సబర్బన్ రైలు, 2 ఎక్స్‌ప్రెస్‌లను పొన్నేరి రైల్వేస్టేషన్ వద్ద ఆపేశారు. ఆ తర్వాత 10కి పైగా ఎక్స్‌ప్రెస్‌లను మార్గమధ్యంలో నిలిపేశారు. సిబ్బంది సుమారు రెండున్నర గంటలు శ్రమించి పగుళ్లను బాగుచేశారు. మధ్యాహ్నం 12.30 తర్వాత రైళ్లు బయలుదేరివెళ్లాయి.

జాలర్ల విడుదలకు కేంద్రానికి స్టాలిన్ లేఖ

చెన్నై, న్యూస్‌టుడే: శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన రాష్ట్ర జాలర్లను విడిపించాలంటూ కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ కోరారు. ఈ మేరకు గురువారం రాసిన లేఖలో రామేశ్వరానికి చెందిన 16 మంది జాలర్లు రెండు బోట్లలో చేపల వేటకు వెళ్లగా బుధవారం శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిందని తెలిపారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కావడం మత్స్యకారుల కుటుంబాల్లో ఆవేదన కలిగించడమే కాక వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను అడ్డుకోవాలని, శ్రీలంక ఆధీనంలోని రాష్ట్ర జాలర్లు 128 మందిని, 199 ఫిషింగ్ బోట్లను విడిపించడానికి తగిన దౌత్యపరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

శాశ్వత పరిష్కారం చూపాలి: అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: జాలర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో.. భారత-శ్రీలంక సంయుక్త కార్యవర్గ సమావేశం 29న శ్రీలంక రాజధాని కొలంబోలో జరగనున్నట్లు ప్రకటించారన్నారు. రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికాదళ దౌర్జన్యాలు కొనసాగుతున్న నేపథ్యంలో సమావేశం ఏర్పాటు చేయటం, అందులో తమిళనాడు మత్స్యశాఖ అధికారులు పాల్గొననుండటం స్వాగతించదగిందని పేర్కొన్నారు. రెండు దేశాల అధికారులు జాలర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.



దెబ్బతిన్న టైల్స్



భవనం వెలుపల సిబ్బంది, పోలీసులు



బాబోయ్ భూకంపం!

- పరుగులు పెట్టిన సచివాలయ సిబ్బంది
- నామక్కల్ బిల్డింగ్‌లో పగుళ్లతో ఉత్కంఠ
- 'ఎయిర్ క్రాక్'గా నిర్ధారించిన పీడబ్ల్యూడీ ఇంజినీర్లు

చెన్నై, న్యూస్‌టుడే: సచివాలయం ప్రాంగణంలోని నామక్కల్ కవిజ్ఞర్ బిల్డింగ్ తొలి అంతస్తులోని టైల్స్‌లో అకస్మాత్తుగా పగుళ్లు రావడంతో సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. భూకంపం వచ్చేసిందని భావించి పరుగులు పెట్టారు. 'ఎయిర్ క్రాక్' కారణమని తేల్చడంతో ఊపిరి పీల్చుకున్నారు. సెయింట్ జార్జికోటలోని సచివాలయం ప్రాంగణంలో పది అంతస్తులతో కూడిన నామక్కల్ కవిజ్ఞర్ భవనం పలు ప్రభుత్వ శాఖలతో కొనసాగుతోంది. గురువారం ఉదయం తొలి అంతస్తులోని ఫ్లోర్ టైల్స్‌లో అకస్మాత్తుగా పగుళ్లు వచ్చాయి. గమనించిన అక్కడి వ్యవసాయశాఖ సంబంధిత కార్యాలయ సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. భూకంపం వచ్చిందని భావించి కిందకు పరుగులు పెట్టారు. విషయం తెలుసుకున్న భవనంలోని మిగతా అంతస్తుల్లోని సిబ్బంది కూడా బయటకు వచ్చేశారు. సమాచారం తెలిసి అగ్నిమాపక, పోలీసు, ప్రజాపనులశాఖ అధికారులు, ఉద్యోగులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఎలాంటి భూకంపం రాలేదని, ఎయిర్‌క్రాక్ కారణంగా టైల్స్‌లో పగుళ్లు ఏర్పడ్డాయని తేల్చారు. అనంతరం సిబ్బంది భవనంలోకి వెళ్లి పనుల్లో నిమగ్నమయ్యారు.

పాతవి కావడంతో..

ఘటన జరిగిన అంతస్తును ప్రజా పనులశాఖ మంత్రి వేలు పరిశీలించి అధికారులతో మాట్లాడారు. భవనం ధృడత్వంలో ఎలాంటి సమస్య లేదని, ఘటన జరిగిన వెంటనే ఇంజినీర్లను పిలిపించి అధ్యయనం చేయించామని మంత్రి పేర్కొన్నారు. 14ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన టైల్స్ కావడంతో ఎయిర్ క్రాక్‌తో పగుళ్లు ఏర్పడ్డాయని తెలిపారు. అప్పట్లో అడుగు పొడవు, వెడల్పు ఉన్న టైల్స్‌ను వేయించామని, ప్రస్తుత ఘటన నేపథ్యంలో వాటిని తొలగించి 2 అడుగుల పొడవు, వెడల్పు ఉన్నవి వేయించనున్నట్లు వెల్లడించారు.

ముఖ్యమంత్రితో స్క్రాపిఫై ఎకోటెక్ వ్యవస్థాపకులు భేటీ

చెన్నై, న్యూస్‌టుడే: ప్రపంచస్థాయి గుర్తింపు పొందేందుకు డెన్మార్క్‌లో జరగనున్న 'నెక్స్ట్ జనరేషన్ డిజిటల్ యాక్షన్' సదస్సులో పాల్గొననున్న 18 సంస్థల్లో భారత్ నుంచి ఎంపికైన రెండు సంస్థల్లో రాష్ట్రానికి చెందిన అంకుర సంస్థ 'స్క్రాపిఫై ఎకోటెక్' ఒకటి. ఈ సంస్థ వ్యవస్థాపకులు అళగు పాండియరాజా గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన గుర్తింపు, ప్రోత్సాహమే తమ సంస్థ ఉన్నతికి కారణమని తెలిపారు. ఆయన్ను ముఖ్యమంత్రి అభినందించారు. వెంట మంత్రి పళనివేల్ త్యాగరాజన్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మురుగానందం, సమాచార సాంకేతిక, డిజిటల్ సేవలశాఖ అదనపు ప్రధానకార్యదర్శి కుమార్ జయంత్, తమిళనాడు సాంకేతిక కేంద్రం సీఈవో వనితా వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పొన్నయ్యన్

డీఎంకే కూటమి విచ్ఛిన్నం ఖాయం

పొన్నేరి, న్యూస్‌టుడే: డీఎంకే కూటమి విచ్ఛిన్నం కావడం ఖాయమని అన్నాడీఎంకే మాజీ మంత్రి పొన్నయ్యన్ అన్నారు. తిరువళ్లూరు ఉత్తర జిల్లా పార్టీ కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. పొన్నయ్యన్ మాట్లాడుతూ పార్టీలో జూనియర్ ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టడంపై సీనియర్లు గుర్రుగా ఉన్నారని, కూటమి పార్టీనేతల సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటవడం ఖాయమన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బలరామన్, మాజీ ఎమ్మెల్యేలు విజయకుమార్, పొన్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

మెట్రో పోరూరు బైపాస్ స్టేషన్‌కు ఒకటే మార్గం

వడపళని, న్యూస్‌టుడే: నగరంలో మెట్రో రెండో దశలో మూడు వేర్వేరు మార్గాల్లో పనులు జరుగుతున్నాయి. అన్ని స్టేషన్లలో ప్రవేశ, బయటికి వచ్చేందుకు ప్రత్యేకంగా మార్గాలు నిర్మిస్తున్నారు. పోరూరు బైపాస్ స్టేషనులో రెండింటికీ ఒకటే మార్గమని సీఎంఆర్ఎల్ అధికారులు పేర్కొన్నారు. ఇక్కడ ఎదురుగా చెరువు ఉన్నందున ఒకటే మార్గం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముల్లైతోట్టం స్టేషన్‌కు కూడా ఒకటే మార్గంతోనే ఉంటుందని, స్థల సమస్య అందుకు కారణమన్నారు. ఇది పరిష్కారమైతే రెండో మార్గాన్ని కూడా నిర్మిస్తామని చెప్పారు.



కార్యక్రమంలో పాల్గొన్న మహిళా పోలీసులు

పోక్సో చట్టంపై శిక్షణ తరగతులు

ప్యారిస్, న్యూస్‌టుడే: పోక్సో చట్టంపై పోలీసులకు రెండు రోజులు శిక్షణ తరగతులు జరిగాయి. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరు అరుణ్ ఉత్తర్వుల మేరకు చెన్నైలోని అన్ని మహిళా పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, పోలీసులకు పోక్సో కేసులకు సంబంధించిన సందేహాలు, ఏ విధంగా దర్యాప్తు చేపట్టాలనే విషయమై కమిషనరు కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతులను సెంట్రల్ క్రైం బ్రాంచి అదనపు కమిషనరు రాధిక ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కీల్పాక్కం వైద్య కళాశాల ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ మణికంఠ రాజు పోక్సో కేసుల్లో బాధితులు, నిందితుల నుంచి శాంపిల్స్‌ను ఎలా సేకరించి పరిశోధనకు పంపాలి, ప్రశ్నలు ఎలా అడగాలి అనే విషయాలను వివరించారు. మహిళా పోలీసులు తమ సందేహాలను అధికారులకు అడిగి నివృత్తి చేసుకున్నారు.

అనిశా అధికారుల సోదాలు

అరక్కోణం, న్యూస్‌టుడే: మోటారు వాహన తనిఖీ అధికారి ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో రూ. 4,45,900 అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రాణిపేట జిల్లా అరక్కోణం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో రూ. 1,05,210 నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాణిపేట పట్టణం నవల్‌పూర్ వద్ద మోటారు వాహన తనిఖీ అధికారిణి శ్రీదేవి జయంతి నివాసం ఉంటున్నారు. ఈమె వేలూరు జిల్లా కాట్పాడి వద్ద కొనసాగుతున్న మోటార్ వాహన తనిఖీ చెక్‌పోస్టులో అధికారిగా పనిచేస్తున్నారు. రాణిపేటలోని శ్రీదేవి జయంతి ఇంట్లో ఆకస్మిక సోదాలు నిర్వహించి రూ. 4,45,900లను స్వాధీనం చేసుకున్నారు. అరక్కోణం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అనిశా డీఎస్పీ గణేశన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో నలుగురు బ్రోకర్ల నుంచి రూ. 1,5,210 నగదను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.



పురస్కార గ్రహీతలతో కె.తరనిక్కరసు

పీయూ ఆచార్యులకు పురస్కారాలు

వడపళని, న్యూస్‌టుడే: వర్సిటీలోని ఆచార్యులకు ప్రతిష్ఠాత్మక పురస్కారాలందాయని 'పుదుచ్చేరి యూనివర్సిటీ' గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. వర్సిటీ హిందీ విభాగం హెడ్ డాక్టర్ సి.జయశంకర్ బాబు సెప్టెంబరు 5న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి 'బెస్ట్ టీచర్' పురస్కారం అందుకున్నారని తెలిపింది. దేశంలో ఉన్నత విద్యా సంస్థల నుంచి అందుకున్న 16 మంది టీచర్లలో శంకర్‌బాబు ఒకరని పేర్కొన్నారు. అలాగే ఆర్ట్స్ విభాగ సహ ఆచార్యులు డాక్టర్ పవిత్ర కర్ణాటక ప్రభుత్వం నుంచి నాటక అకాడమీ పురస్కారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేతుల మీదుగా బెంగళూరులో సెప్టెంబరు 19వ తేదీ స్వీకరించారు. వీరితో పాటు 2024లో శాస్త్రవేత్తల్లో టాప్ రెండు శాతంలో 13 మంది అధ్యాపకులు స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ నుంచి ప్రతిష్ఠాత్మక గ్లోబల్ ర్యాంకింగు సాధించారు. వర్సిటీ ఉపకులపతి, ఆచార్యులు కె.తరనిక్కరసు, డైరెక్టరు, ఆచార్యులు క్లైమెంట్ ఎస్.లార్డెస్, రిజిస్ట్రార్, ఆచార్యులు రజనీష్ భుటాని తదితరులు పురస్కారాలందుకున్న వారికి అభినందనలు తెలియజేశారు.

ఓహెచ్‌ఎం గ్లోబల్ మొబిలిటీకి

ఎంటీసీ 500 ఎలక్ట్రిక్ బస్సుల ఆర్డరు

వడపళని, న్యూస్‌టుడే: హిందూజా గ్రూపు అశోక్ లేలాండ్ అనుబంధ సంస్థ ఓహెచ్‌ఎం గ్లోబల్ మొబిలిటీకి మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(ఎంటీసీ) నుంచి 500 ఎలక్ట్రిక్ బస్సులకు ఆర్డరు లభించింది. ఒప్పందం మేరకు ఓహెచ్‌ఎం సంస్థ బస్సుల నిర్వహణ 12 ఏళ్ల పాటు చూసుకుంటుందని అశోక్ లేలాండ్ సంస్థ గురువారం ప్రకటనలో పేర్కొంది. 400 బస్సులు నాన్-ఏసీ, 100 బస్సులు ఏసీవి తయారు చేయనుంది. 37 మంది కూర్చునేందుకు, 24 మంది నిల్చునేలా బస్సు డిజైన్ చేయనున్నట్లు అశోక్ లేలాండ్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టరు షేను అగర్వాల్ పేర్కొన్నారు. పెరంబూరు, పెరుంబాక్కం, పూనమల్లి, వ్యాసార్పాడి, తండియార్‌పేట, కేకే నగర్ డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి.

ప్రైవేట్ ఆన్‌లైన్ సంస్థల్లో కో-ఆప్‌టెక్స్ విక్రయాలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: దీపావళి పండుగకు రూ. 100 కోట్ల విలువైన కో-ఆప్‌టెక్స్ వస్త్రాలను 'ఆన్‌లైన్' ద్వారా విక్రయించాలని చేనేత శాఖ తీర్మానించింది. చేనేత శాఖాధికారి ఒకరు మట్లాడుతూ.. కో-ఆప్‌టెక్స్‌కు ప్రత్యేక వెబ్‌సైట్ ఉన్నా అన్ని వర్గాల వారు లబ్ధి పొందడానికి ప్రైవేట్ ఆన్‌లైన్ సంస్థలతో చేతులు కలపాలని తీర్మానించినట్లు చెప్పారు. వినియోగదారులు వద్దనుకున్నవి తిరిగి తీసుకోవాలని ప్రైవేట్ సంస్థలు నిబంధనలు విధిస్తున్నాయని పేర్కొన్నారు. కో-ఆప్‌టెక్స్ పట్టుచీరలు రూ. 10 వేల నుంచి రూ.లక్షకు పైగా విలువైనవని 'ఆన్‌లైన్'లో కొనుగోలు చేసిన వారు ఉపయోగించుకొని మళ్లీ వెనక్కి పంపే అవకాశం ఉందన్నారు. తొలుత రూ. 1,000 విలువైనవి మాత్రం ఆన్‌లైన్ సంస్థల ద్వారా విక్రయించనున్నట్లు పేర్కొన్నారు.



ఎంఎస్‌ఎంఈ కృషి ప్రశంసనీయం

వడపళని, న్యూస్‌టుడే: స్వదేశీ పరిజ్ఞానంతో రక్షణ రంగానికి కావాల్సిన సామగ్రి తయారు చేయడంలో ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు చేస్తున్న కృషిని రక్షణ మంత్రిత్వ శాఖ ప్రశంసించింది. నగరంలోని ఎంఎస్‌ఎంఈ భవన్‌లో బుధవారం విక్రేతలు, కొనుగోలుదారుల పరస్పర చర్చలపై జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి వీడియో ద్వారా అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ క్వాలిటీ అష్యూరెన్స్ ఎ.గోవర్ధన్ పాల్గొని ప్రసంగించారు. ఉత్పత్తుల్లో నాణ్యతను బాగా పెంచాలని సూచించారు. ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలకు రిజిస్ట్రేషన్ విధానాన్ని కేంద్రం పోర్టల్‌లో సులభతరం చేసిందని కార్యక్రమానికి హాజరైన పుణె డైరెక్టరేట్ ఆఫ్ క్వాలిటీ అష్యూరెన్స్ కంట్రోలర్ బ్రిగేడియర్ రజనీష్ భట్‌నగర్ తెలిపారు.



ప్రసంగిస్తున్న రక్షణ విభాగ అధికారి



ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకుంటూ..

పరుగుపందెంలో
పతకాల వీరుడు
సత్తాచాటుతున్న అగ్నిమాపక ఉద్యోగి మారియప్పన్

అంతర్జాతీయ పోటీల్లో ఒకటి.. రెండు కాదు.. ఏకంగా నాలుగు బంగారు పతకాలు సొంత చేసుకున్నాడు అగ్నిమాపకశాఖ ఫైర్‌మ్యాన్ మారియప్పన్(22). ఇందుకోసం కఠిన సాధన చేశారు. చిన్నప్పటి నుంచి ఏర్పడిన ఆసక్తే కొలువుకు మార్గం చూపింది. పతకాల సాధనను ఆయన వివరిస్తున్నారిలా..

-న్యూస్‌టుడే, ఆర్కేనగర్

నెల్లై సమీపంలోని నాంజాన్‌కులం స్వగ్రామం. తల్లిదండ్రులు మురుగదాస్- మారియమ్మాల్. నాన్న భవన నిర్మాణ కార్మికుడు. తమ్ముడు మాధేష్ కొరియర్ కంపెనీలో పని చేస్తున్నాడు. పాళ్యంగోట్టైలో చదువు మొత్తం ముగించాను. చిన్న వయసు నుంచే పరుగుపందెం అంటే ఆసక్తి. కళాశాల చదువు ముగించే సమయానికి అగ్నిమాపకశాఖలో క్రీడాకారుల కోటాలో ఉద్యోగం వచ్చింది. చెన్నై తండయారుపేట్టైలోని అగ్నిమాపకకేంద్రంలో చేరాను. నా పరుగుపందెం చూసి అధికారులు సొంత జిల్లా నెల్లైలో పనిచేసేందుకు అనుమతిచ్చారు. పాళ్యంగోట్టై అన్నా క్రీడామైదానంలో శిక్షణ పొందేందుకు వీలుగా సమీపంలోని అగ్నిమాపకకేంద్రంలో చేరాను.

కొండప్రాంతంలో సాధన..

పాఠశాలలో ప్లస్‌టూ చదివేటప్పుడు పీటీ మాస్టర్ ప్రోత్సహించి తగిన శిక్షణ ఇచ్చారు. తొలి రాష్ట్రస్థాయి పోటీలో మూడో స్థానంలో నిలిచాను. 2021లో చెన్నైలో జరిగిన రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్ పోటీలు, 2022 కోవైలో జరిగిన పోటీల్లో వరుసగా బంగారు పతకాలు సాధించాను. అఖిల భారత స్థాయిలో ఐదో స్థానం చేరుకున్నాను. నిత్యం తెల్లవారుజామునే పాళ్యంగోట్టై రెడ్డియార్‌పట్టి కొండ ప్రాంతంలో కఠిన సాధన చేసేవాడిని. ద్విచక్రవాహనం వెనుక తాడు పట్టుకొని వేగంగా పరిగెత్తేవాడిని. లారీ టైర్‌ని లాగుతూ చూడా పరుగులు తీసేవాడిని.



మారియప్పన్

కఠిన పరిస్థితుల్లో..

డెన్మార్క్‌లోని అల్బార్క్ నగరంలో గతనెల 9 నుంచి 11 వరకు జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్ పోటీల్లో భారత్ నుంచి 15 మంది పాల్గొన్నారు. తమిళనాడు నుంచి నేను మాత్రమే ఉన్నాను. 200మీ., 400 మీ., 800మీ., 1500 మీ. పరుగు పందేల్లో మొదటిస్థానంలో నిలిచి నాలుగు బంగారు పతకాలు సాధించాను. అక్కడ మంచు ఎక్కువ. ఉష్ణోగ్రతలు 4 నుంచి 10 డిగ్రీల వరకు ఉన్నాయి. అదే సమయంలో ఆహారం సెట్ కాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పతకాలు గెలవడం మరచిపోలేనిది. మరిన్ని పతకాలు సాధించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నాను.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా అంతరాయం కలగనుంది. గవర్నమెంట్ ఎస్టేట్ ప్రాంతంలోని పలు వీధులతో పాటు కలైవానర్ అరంగం, ప్రజాపనుల శాఖ కాంప్లెక్స్, మద్రాసు వర్సిటీలో ఆ సమయంలో సరఫరా ఉండదని అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు.



డ్యామ్ నీటిలో నురగ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: హోసూరులోని కెలవరపల్లి డ్యామ్ నుంచి తెన్‌పెణ్ణై డ్యామ్‌కు విడుదల చేసిన నీటిలో రసాయన నురగ వస్తోంది. అది గాలిలో ఎగురుతూ పొలాల్లో పడుతున్నందున పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నురుగు కాజ్‌వేపై చేరుకోవడంతో రాకపోకలు ఆగిపోయాయి. అక్కడి ప్రజలు పాగలూర్, ముత్తాలి మార్గంగుండా 15 కి.మీ. చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన వెదజల్లడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు.

నకిలీ ఎన్‌సీసీ శిబిరం కేసు దర్యాప్తు సంతృప్తికరంగా లేదు: హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: నకిలీ ఎన్‌సీసీ శిబిరం కేసు దర్యాప్తు సంతృప్తికరంగా లేదని మద్రాసు హైకోర్టు తెలిపింది. కృష్ణగిరిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నకిలీ ఎన్‌సీసీ శిబిరం నిర్వహించి విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేసిన కేసు దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయాలని మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పిటిషన్ బుధవారం విచారణకు వచ్చింది. ప్రభుత్వం తరఫున.. నాలుగు పాఠశాలల్లో జరిగిన ఘటనల వ్యవహారమై మూడు కేసులు నమోదు చేసినట్లు, మూడింట్లో మధ్యంతర అభియోగపత్రం దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. బాధిత విద్యార్థినులకు పరిహారంగా ఇవ్వడానికి రూ. 1.63 కోట్లను కృష్ణగిరి మహిళా కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం డిపాజిట్ చేసినట్లు తెలిపారు. శివరామన్ తన కార్యాలయంలో విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేశాడని, వారిని మహాబలిపురం, కొడైక్కానల్ తదితర పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లాడని, ఘటన జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు దర్యాప్తు నివేదిక దాఖలు చేస్తారన్నారు. నాలుగు పాఠశాలలో నకిలీ ఎన్‌సీసీ శిబిరాలు ఎలా నిర్వహించారనే విషయమై సమగ్రంగా దర్యాప్తు చేయాలని న్యాయమూర్తులు ఉత్తర్వులు ఇచ్చారు. న్యాయమూర్తులు తదుపరి విచారణ 30కి వాయిదా వేశారు.

ఫిబ్రవరి 10, 11 తేదీల్లో సీఐఐ సదస్సు

వడపళని, న్యూస్‌టుడే: 'మైస్టిక్ సౌత్ 2025 గ్లోబల్ లింకేజస్' సదస్సు చెన్నైలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 10, 11 తేదీల్లో జరుగుతుందని 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' (సీఐఐ) గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. '2047 నాటికి ది సదరన్ ఒడిస్సే పవరింగ్ అహెడ్ టు ఎ 10 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ' మీద సదస్సులో పలువురు వక్తలు ప్రసంగించనున్నారు. కాన్సుల్ జనరల్స్, డిప్యూటీ హై కమిషనర్లు, ట్రేడ్ కమిషనర్లు, గౌరవ కాన్సుల్స్, పలు దేశాలకు చెందిన ప్రముఖ ప్రతినిధులు, పారిశ్రామిక రంగ దిగ్గజాలు సదస్సుకు హాజరు కానున్నట్లు మైస్టిక్ సౌత్ 2025 గ్లోబల్ లింకేజస్ సదస్సు ఛైర్మన్, టేలర్ రబ్బర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ టీటీ అశోక్ పేర్కొన్నారు. ఫిబ్రవరిలో జరిగే సదస్సులో 'ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్' (ఈఎస్‌డీఎం), మొబిలిటీ, సస్టెయినబులిటీ, టూరిజం, ఆర్ట్స్, కల్చర్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ వంటి అంశాలు చోటు చేసుకోనున్నాయని ఆయన పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న టీటీ అశోక్ తదితరులు

సీమాన్‌పై ప్రభుత్వ న్యాయవాది ఫిర్యాదు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తమిళ్‌తల్లి ప్రార్థనా గీతానికి సంబంధించి నామ్ తమిళర్ కట్చి ప్రధాన సమన్వయకర్త సీమాన్ విమర్శలపై డీఎంకే తరఫున ఖండించారు. ఈ నేపథ్యంలో తిరుచ్చి జిల్లా మణప్పారైకు చెందిన ప్రభుత్వ న్యాయవాది మురళీకృష్ణన్ ఎస్పీ వరుణ్‌కుమార్‌కు ఫిర్యాదు అందించారు. సీమాన్ 'ఎక్స్' పేజీలో.. తాను అధికారంలోకి వస్తే తమిళ్‌తల్లి ప్రార్థనా గీతాన్ని తీసేస్తానని పోస్టు పెట్టారు. సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. ఇది ప్రార్థనా గీతాన్ని హేళన చేసేలా ఉందని, యువతలో గీతంపై ఉన్న ప్రతిష్ఠ మసకబారే ప్రమాదం ఉందన్నారు. సీమాన్‌పై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.



ఎస్పీ వరుణ్‌కుమార్‌కు ఫిర్యాదు అందిస్తున్న న్యాయవాది మురళీకృష్ణన్

ఈఎన్‌ఏసీతో ఐఐటీఎం ఒప్పందం

వడపళని, న్యూస్‌టుడే: ఏవియేషన్ సేఫ్టీ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక కోర్సు అందించేందుకు ఫ్రెంచి యూనివర్సిటీకి చెందిన ఎల్ ఇకోలే నేషనలే డి 1 ఏవియేషన్ సివిలే (ఈఎన్‌ఏసీ) సంస్థతో ఐఐటీ మద్రాస్ ప్రవర్తక టెక్నాలజీస్ ఫౌండేషన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేస్తున్న వారి కోసం కోర్సు ప్రత్యేకంగా రూపొందించారు. వచ్చే ఏడాది జనవరిలో మొదటి బ్యాచ్ తరగతులు ప్రారంభమవుతాయి. గరిష్ఠంగా 30 సీట్లు ఉంటాయన్నారు. కోర్సులో చేరాలనుకునేవారు dsa@iitmpravartak.net లేదా https:///digitalskills.iitmpravartak.org.inourse_details.php?courseID=285&cart వెబ్‌సైట్ ద్వారా డిసెంబరు 15లోపు దరఖాస్తు చేసుకోవాలి. కోర్సుకాల వ్యవధి రెండేళ్లు. మొదటి సంవత్సరంలో రెండు నెలల కోసారి వారం రోజుల పాటు, రెండో సంవత్సరంలో నెలకోసారి వారం రోజులు ప్రత్యక్ష తరగతులుంటాయి. కోర్సు పూర్తయ్యే వరకు అధ్యాపకులు ఫ్రాన్స్ నుంచి ఐఐటీఎంకు విచ్చేస్తారు. ఆరు నెలలు ప్రాజెక్టు కూడా ఉంది. రెండు దశాబ్దాలుగా పౌర విమానయాన (సివిల్ ఏవియేషన్) రంగం బాగా అభివృద్ధి చెందుతోందని ప్రవర్తక్ సీఈఓ, డాక్టర్ ఎంజే శంకర్ అన్నారు.

రద్దయిన రైళ్లు

వడపళని, న్యూస్‌టుడే: 'దానా' తుపాను కారణంగా కొన్ని రైళ్లను రద్దు చేసినట్టు దక్షిణ రైల్వే ప్రకటన విడుదల చేసింది.

■ 12551 ఎస్ఎంవీటీ బెంగళూరు-కామాఖ్య వయా జోలార్‌పేట్టై, కాట్పాడి, పెరంబూరు 26న 08.50కు, 12510 గువాహటి-ఎస్ఎంవీటీ బెంగళూరు వయా పెరంబూరు, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పేట్టై 27న 06.15 బయలుదేరే రైళ్లు రద్దయ్యాయి.

యూట్యూబర్ ఇర్ఫాన్‌కు నోటీసు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నైకు చెందిన యూట్యూబర్ ఇర్ఫాన్, ఆసిఫా దంపతులకు జులైలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బిడ్డ జన్మించింది. ప్రసవ సమయంలో ఆపరేషన్ థియేటర్‌లో బిడ్డ బొడ్డుతాడు కట్ చేసే వీడియోను ఇర్ఫాన్ యూట్యూబ్‌లో విడుదల చేశాడు. ఇది రాష్ట్ర వైద్య చట్ట ప్రకారం తప్పు అని వైద్యులు ఖండించారు. ఇర్ఫాన్‌పై చట్టప్రకారం, శాఖపరంగా చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశాఖ మంత్రి మా. సుబ్రమణియన్ చెప్పారు. ఆయన ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారని, నోటీసులు పంపామని తెలిపారు. ఇర్ఫాన్, సంబంధిత ఆస్పత్రిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు ఉందన్నారు. సదరు ఆస్పత్రి సేవలు పదిరోజుల పాటు నిలిపివేసినట్లు చెప్పారు. వైద్యురాలిపైనా చర్యలు తీసుకుంటామన్నారు.

27న నిత్యావసరాల పంపిణీ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఈనెల 27న అన్ని రేషన్ దుకాణాలు పని చేస్తాయని సహకార శాఖమంత్రి కేఆర్ పెరియకరుప్పన్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రేషన్ దుకాణాల ద్వారా సహకార బ్యాంకు పొదుపు ఖాతా

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు సహకార బ్యాంకు పొదుపు ఖాతా ప్రారంభించి బ్యాంకు సేవలు అందించడానికి చర్యలు తీసుకోవాలని జోనల్ జాయింట్ రిజిస్ట్రార్లకు సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సహకార సంఘాల రిజిస్ట్రార్ సుబ్బయ్యన్ పంపిన సర్క్యులర్‌లో.. రేషన్ దుకాణ సిబ్బంది ద్వారా పొదుపు ఖాతాకు దరఖాస్తులు అందించి పూర్తి చేసినవాటిని స్వీకరించి ప్రారంభించనున్న ఖాతాకు తలా రూ. 5 ప్రోత్సాహక నగదు అందించారు. పొదుపు ఖాతాదారులకు సహకార బ్యాంకుల రుణ, డిపాజిట్ పథకాల సౌకర్యం కల్పించి ఏటీఎం కార్డులు అందించాలని పేర్కొన్నారు.

కృష్ణగిరికి తరలి వస్తున్న కర్మాగారాలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరికి కర్మాగారాలు పోటాపోటీగా తరలి వస్తున్నాయి. తద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. కృష్ణగిరి జిల్లా కర్ణాటక, ఆంధ్రా సరిహద్దున సముద్ర మట్టానికి 1,500 మీటర్ల ఎత్తులో ఉంది. జిల్లాలోని హోసూర్‌లో టీవీఎస్, అశోక్ లేలాండ్ తదితర ప్రముఖ మోటారు కంపెనీలు, టైటాన్ వాచీల తయారీ, ఇతర పలు సంస్థలు ఉన్నాయి. ఆ సంస్థలకు అవసరమైన విడిభాగాల తయారీకి చేయడానికి 3 వేలకు పైగా చిరుపరిశ్రమలు ఇక్కడ పనిచేస్తున్నాయి. వాటిని ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి లభిస్తోంది. ఇక్కడి ఎలక్ట్రికల్ స్కూటర్, సెల్‌ఫోన్ తయారీ సంస్థల్లో సుమారు 50 వేల మందికి పైగా పనిచేస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, అనుభవం ఉన్న కార్మికులు, చేరువలో ఉన్న బెంగుళూరు, నాలుగు గంటల చెన్నై హార్బర్ పయనం, జాతీయ రహదారుల ఉన్నందున పరిశ్రమల ఏర్పాటుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వారికి పూర్తి సహకారం అందిస్తోంది.



ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీలో యువతులు

జిల్లా కలెక్టరు స్థల పరిశీలన

అరక్కోణం: రాణిపేట పట్టణ సమీపంలోని అమ్మూరు పంచాయతీ లాలికుప్పం వద్ద ఉన్న ఎల్‌సీ 47సి రైల్వేగేటు మూసివేసి ఆ రైలుమార్గం కిందనే సొరంగ మార్గాన్ని నిర్మించే నిమిత్తం గురువారం జిల్లా కలెక్టరు చంద్రకళ స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో అమ్మూరు పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు సంగీత మహేష్, రైల్వే డివిజనల్ అడిషనల్ ఇంజినీరు (విద్యుత్) నిర్మల్ కుమార్, ఆర్డీవో రాజరాజన్, హైవేస్ డివిజనల్ ఇంజినీరు సెల్వకుమార్, వాలాజాపేట తహసీల్దారు అరుళ్‌సెల్వన్ ఉన్నారు.

6,585 బాణసంచా దుకాణాలకు అనుమతి

ప్యారిస్, న్యూస్‌టుడే: దీపావళిని పురస్కరించుకుని తాత్కాలిక బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తుంటారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 9,177 దరఖాస్తులు రాగా 6,585 బాణసంచా దుకాణాలకు అనుమతి ఇచ్చారు. నిబంధన మేరకు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు అగ్నిమాపకశాఖ డైరక్టరు, డీజీపీ ఆబాష్‌కుమార్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అగ్నిమాపక కేంద్రాలకు ఆదేశాలు ఇచ్చారు. పేలుడు పదార్థాల చట్టం నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించిన తరువాతే అనుమతి ఇవ్వాలని చెప్పారు. ఇంకా 1,911 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని 681 నిరాకరించినట్లు తెలిపారు.

మరింత మెరుగైన ఎఫ్‌ఎం రేడియో సేవలు

టీనగర్, న్యూస్‌టుడే: నూతన ఎఫ్‌ఎం రేడియో కోసం దరఖాస్తుకు నవంబరు 18 వరకు గడువు ఉందని కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. కన్సల్టేటివ్ కమిటీ ఆఫ్ సిటీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నగరంలో కార్యక్రమం జరిగింది. ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలు డా.వీఎల్ ఇందిరాదత్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి ఎల్.మురుగన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 234 నగరాల్లో ఎఫ్‌ఎం రేడియో స్టేషన్ల ఏర్పాటుకు అనుమతించి వాటి సేవలు మరింత మెరుగుపడేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తమిళనాడులోని 11 నగరాల్లోనూ రేడియో సేవలు విస్తరించనున్నట్లు తెలిపారు. డా.వీఎల్ ఇందిరాదత్ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలోనూ రేడియో ఛానళ్లకు జనాదరణ కొనసాగుతుండటం విశేషమన్నారు. మద్రాస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రామ్‌కుమార్ శంకర్, నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సయ్యద్ మునీర్ అహ్మద్, హిందూస్థాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు లెనేస్ శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎల్.మురుగన్

ఉప ముఖ్యమంత్రితో పలువురి భేటీ



భారత పరిశ్రమల శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి

సైదాపేట, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌తో గురువారం పలువురు భేటీ అయ్యారు. ముందుగా సచివాలయంలో ఉప ముఖ్యమంత్రిని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) దక్షిణ భారత అధ్యక్షురాలు నందిని రంగస్వామి కలిసి మాట్లాడారు. ఇందులో ఇండియా పరిశ్రమల సమాఖ్య తమిళనాడు అధ్యక్షుడు శ్రీవస్థరామ్, ఉపాధ్యక్షుడు ఏఆర్ ఉన్నికృష్ణన్, సీఐఐ నిర్వాహకులు ఉన్నారు. అలాగే చెన్నైలో ఉండే జపాన్ దేశ రాయబారి టకాహాషి మునియో సచివాలయంలో డిప్యూటీ సీఎంను కలిసి చర్చించారు. రాష్ట్ర యువజన సంక్షేమ, క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ కార్యదర్శి అతుల్యా మిశ్రా, చెన్నైలోని జపాన్ రాయబార కార్యాలయ అధికారులు వెంట ఉన్నారు. టీవీఎస్ సంస్థ అధ్యక్షుడు వేణు శీనివాసన్ తన సతీమణితో కలిసి ఉప ముఖ్యమంత్రిని సచివాలయంలో కలిశారు.

ముఖ్యమంత్రితో ఏఐటీటీ ఉత్తీర్ణుల భేటీ

చెన్నై, న్యూస్‌టుడే: ట్రేడ్ 4.0 సాంకేతిక కేంద్రాలుగా స్థాయి పెంచిన ప్రభుత్వ ఐటీఐలలో శిక్షణ పొందిన రాష్ట్రానికి చెందిన విద్యార్థుల్లో 29 మంది తొలి ఏడాదిలోనే ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌లో జాతీయస్థాయి ర్యాంకులు సాధించారు. ట్రైనర్ల శిక్షణలో(సీటీఎస్) కాట్టుమన్నార్ కోవిల్ ప్రభుత్వ ఐటీఐ ట్రైనర్ శ్వేత వెల్డర్ విభాగంలో జాతీయస్థాయిలో తొలిర్యాంకు సాధించారు. వారంతా ముఖ్యమంత్రి స్టాలిన్‌ను గురువారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ముఖ్యమంత్రి అభినందించారు. వెంట మంత్రి సీవీ గణేశన్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మురుగానందం, కార్మిక సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి వీరరాఘవరావ్, ఉపాధి కల్పన, శిక్షణశాఖ సంచాలకులు విష్ణుచంద్రన్ తదితరులు ఉన్నారు.



ముఖ్యమంత్రితో విద్యార్థులు



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

గతుకుల రోడ్డు బాగు చేయండి

పెరయిపాళ్యం, న్యూస్‌టుడే: పెరియపాళ్యం సమీప ముక్కరంబాక్కం పంచాయతీ పరిధిలోని అంజాంబేడు, చంద్రాపురం గ్రామాల్లో సుమారు వెయ్యి మంది జనాభా నివసిస్తున్నారు. ముక్కరంబాక్కం -నెల్వాయ్ మధ్య 4 కి.మీ. రోడ్డును వినియోగించుకుంటున్నారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు గుంతలుగా మారడంతో పాదచారులు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో గురువారం నెల్వాయ్ రోడ్డులో చెట్ల కొమ్మలు వేసి ఆందోళనకు దిగారు. వారితో ఊత్తుకోట సీఐ దేవరాజ్ చర్చలు జరిపారు. జనవరిలో కొత్త రోడ్డు నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

వైద్యలింగం కార్యాలయంలో

కొనసాగిన ఈడీ సోదాలు

ప్యారిస్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే మాజీ మంత్రి వైద్యలింగం కార్యాలయంలో రెండోరోజూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) సోదాలు చేపట్టింది. రూ. 27 కోట్లు లంచం తీసుకున్న వ్యవహారమై ఈ సోదాలు జరిగాయి. కేసుకు సంబంధించిన పత్రాల కోసం చెన్నై ఎగ్మూర్‌లోని సీఎండీఏ కార్యాలయంలో అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. చెన్నై అశోక్‌నగర్‌లోని వైద్యలింగం కార్యాలయంలో రెండోరోజూ అధికారులు సోదాలు కొనసాగించారు.

కొత్త నటీనటులతో బ్రేక్ ఫాస్ట్


చిత్రంలోని ఓ సన్నివేశం

చెన్నై, న్యూస్‌టుడే: గిరిజా వరదరాజన్ నిర్మాణ సారథ్యంలో రూపొందుతున్న చిత్రం 'బ్రేక్ ఫాస్ట్'. కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు రాసి దర్శకత్వ బాధ్యతలను గాంధీ కృష్ణ చేపట్టారు. వైరముత్తు పాటలు రాయగా చిత్రంలోని నాలుగు పాటలకు జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం సమకూర్చారు. పాటల సన్నివేశాలను విదేశాల్లో తెరకెక్కించారు. రాణవ్, రోసిమిన్, కృత్తిక్ మోహన్, అమిత తదితర కొత్త నటీనటులు ప్రధాన పాత్రలు పోషించారు. అర్చన, సంపత్‌రాజ్, కస్తూరి, మదన్ బాబ్, రవి మరియ, దర్శకులు బాలాజీ శక్తివేల్, రంగనాథన్ తదితరులు ఇతర నటీనటులు. చిత్రీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

పాత ముంబయిని కళ్లెదుట నిలిపారు

చెన్నై, న్యూస్‌టుడే: వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందిన 'లక్కీ భాస్కర్' 31న విడుదల కానుంది. నగరంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నటుడు రామ్‌కీ మాట్లాడుతూ.. తమిళానికి తగినట్టు సినిమా రూపొందించారన్నారు. దుల్కర్ సల్మాన్ సమర్థుడైన నటుడని, తండ్రి సూపర్‌స్టార్‌గా ఉన్నా నిరాడంబరంగా మెలగుతున్నారని తెలిపారు. చిత్రం కోసం పాత ముంబయి సెట్ వేసి కళ్లెదుట నిలిపారన్నారు. రూ.100 కోట్లు వసూలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. ఈ చిత్రం తనకు 'వాత్తి' తర్వాత దానికి భిన్నమైన కథతో రూపొందించాలని భావించి 'లక్కీ భాస్కర్'ను తెరకెక్కించినట్లు తెలిపారు. రజనీకాంత్‌కు వీరాభిమానినని, ఆయన నటించిన 'అన్నామలై' ప్రేరణతో ఇందులో కొన్ని యాక్షన్ సన్నివేశాలకు ప్రయత్నించానని పేర్కొన్నారు. దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ... చిత్రంలో తన కుమారుడిగా యూట్యూబర్ రిత్విక్ నటించారని, చిన్న వయసులోనే అపారమైన నటన కనబరిచాడని తెలిపారు. చాలా కాలం తర్వాత తమిళ ప్రేక్షకుల ఎదుటకు వస్తుండటంతో ఈ సినిమా తన మనసును హత్తుకుందన్నారు.


రామ్‌కీ, దుల్కర్ సల్మాన్, వెంకీ అట్లూరి

మరికొన్ని సినీ విశేషాలు

❖ హిప్ హాప్ తమిళ ఆది నిర్మించి, దర్శకత్వం వహించి నటించిన 'కడైసి ఉలగ పోర్' ఇప్పటికే థియేటర్లలో సందడి చేస్తోంది. గురువారం అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైంది.

❖ దర్శకుడు వెంకట్ ప్రభు, నటుడు విజయ్ కాంబినేషన్‌లో రూపొందిన 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'(గోట్) విడుదలై 50 రోజులైన సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.

❖ రాజేశ్ దర్శకత్వంలో జయం రవి, ప్రియాంక మోహన్ జంటగా నటించిన 'బ్రదర్' 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రంలోని 'మిదక్కుదు కాలు రెండుం' వీడియో పాటను చిత్రబృందం బుధవారం విడుదల చేసింది.


పాటలోని ఓ సన్నివేశం

దురైమురుగన్‌కు స్వల్ప అస్వస్థత

వేలూర్, న్యూస్‌టుడే: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్ గురువారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఉదయం కాట్పాడి సమీపంలోని కాంగేయనల్లూరులో కృపానంద వారియార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాట్పాడి గాంధీ నగర్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం 4.30కు అస్వస్థతకు లోనవడంతో వేలూరు గ్రీన్‌సర్కిల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. మధుమేహం, రక్తపోటు, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించి గంట పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. అనంతరం ఇంటికి తిరిగి వెళ్లారు.

రైలు ప్రమాదాలపై కాంగ్రెస్ అసత్యప్రచారం: హెచ్.రాజా

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తమ పాలనలో రైలు ప్రమాదాలు పెరిగిపోయాయని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని భాజపా నేత హెచ్.రాజా తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఏడాదికి 121 దుర్ఘటనలు జరిగాయన్నారు. భాజపా తొమ్మిదేళ్ల పాలనలో సరాసరి ఏడాదికి 71 ప్రమాదాలే చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. తిరుచ్చి భాజపా కార్యాలయంలో గురువారం సభ్యుల చేరికపై సమావేశం నిర్వహించారు. హెచ్.రాజా నూతన సభ్యులకు గుర్తింపుకార్డులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గవర్నర్‌పై ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు.

విజేతలకు బహుమతులు

అరక్కోణం: రాణిపేట జిల్లా వాలాజాపేటలోని ప్రభుత్వ మహిళా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో గురువారం జిల్లాస్థాయి చిరుధాన్యాలతో వంటకాల తయారీ పోటీలు జరిగాయి. విజేతలుగా నిలిచిన మూడు మహిళా బృందాలకు మంత్రి ఆర్.గాంధీ బహుమతులు అందించారు. కలెక్టరు చంద్రకళ, ఆర్కాడు ఎమ్మెల్యే జేఎల్ ఈశ్వరప్పన్, జిల్లా మహిళా పథకాల అమలు అధికారి రవిచంద్రన్, వాలాజాపేట పంచాయతీ యూనియన్ అధ్యక్షుడు వెంకటరమణన్, మున్సిపల్ అధ్యక్షురాలు హరిణితిల్లై తదితరులు పాల్గొన్నారు.


సింగార చెన్నై 2.0 పథకం కింద రూ.32.62 కోట్లతో జరుగుతున్న విక్టోరియా పబ్లిక్ హాలు పునరుద్ధరణ పనులను జీసీసీ మేయర్ ప్రియ గురువారం పరిశీలించారు. వెంట కమిషనరు కుమరగురుభరన్, డిప్యూటీ కమిషనరు(వర్క్స్) శివకృష్ణమూర్తి, అధికారులు ఉన్నారు. –చెన్నై, న్యూస్‌టుడే


పూజల్లో పాల్గొన్న దురైమురుగన్

'అన్నాడీఎంకే ఖాళీ కావడం ఖాయం'

వేలూర్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి వ్యవహార శైలి నచ్చక అనేక మంది సీనియర్ నేతలు తమతో సంప్రదింపులు జరుపుతున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్ వెల్లడించారు. వేలూర్ జిల్లా కాట్పాడి సమీప కాంగేయనల్లూరులోని కృపానందవారియార్ 31వ వార్షిక గురుపూజ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజలో పాల్గొన్న మంత్రి విలేకరులతో మాట్లాడారు. జయలలిత మరణానంతరం అన్నాడీఎంకేను కాపాడేందుకు శశికళ, ఓ.పన్నీరుసెల్వం ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. దొడ్డు దారిలో ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన ఎడప్పాడి పళనిసామి విశ్వాసపాత్రులను పార్టీ నుంచి తొలగించి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. హిట్లర్‌లా వ్యవహరిస్తున్న అతనికి వ్యతిరేకంగా సీనియర్ నేతలు కొద్ది రోజుల్లో తిరుగుబాటు చేస్తారని అన్నారు.

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత

చెన్నై, న్యూస్‌టుడే: సచివాలయంలో సమాచార ప్రజా సంబంధాలశాఖ కార్యాలయ సహాయకుడు అన్బళగన్ ఈ నెల 5న విధినిర్వహణలో ఉండగా మరణించారు. ఆయన చిన్న తమ్ముడు గుణానిధికి కారుణ్య ప్రాతిపదికన కార్యాలయ సహాయకుడి ఉద్యోగాన్ని అందించారు. సచివాలయంలో గురువారం మంత్రి సామినాథన్ నియామక ఉత్తర్వులను అందించారు. రాజాజీ మండపం, గాంధీమండపంలో హార్టికల్చర్ సిబ్బందిగా పనిచేసిన వరలక్ష్మీ ఈ ఏడాది జనవరి 4న మరణించారు. ఆమె ఏకైక కుమారుడు పరమేశ్వరరావుకు కూడా కారుణ్య ప్రతిపాదికన నియామక ఉత్తర్వులను మంత్రి అందించారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం వెల్లడి

చెన్నై, న్యూస్‌టుడే: కర్ణాటకలోని బెంగళూరు వద్ద మంగళవారం కురిసిన భారీవర్షాలకు నిర్మాణంలోని భవనం కూలి 8 మంది మరణించిన దుర్ఘటనలో రాష్ట్రానికి చెందిన కళ్లకురిచ్చి జిల్లావాసులు మణికంఠన్, సత్యరాజ్ ఉండటంపై ముఖ్యమంత్రి స్టాలిన్ విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ కుటుంబాలకు రూ.2లక్షలు చొప్పున సీఎం పబ్లిక్ రిలీఫ్ ఫండ్ నుంచి అందించాలని ఆదేశించారు.

మదురై రైల్వే డివిజన్ విలీనాన్ని ఉపసంహరించుకోవాలి: వైగో

విల్లివాక్కం: తిరువనంతపురం రైల్వే రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్ బోర్డుతో మదురై రైల్వే డివిజన్ విలీనాన్ని ఉపసంహరించుకోవాలని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో డిమాండ్ చేశారు. గురువారం ప్రకటన విడుదల చేశారు. విలీనంతో తమిళ యువకులు ఉపాధి కోల్పోతారన్నారు. కేరళ యువతకే అధిక ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు రైల్వే శాఖమంత్రితో మాట్లాడానని దక్షిణ రైల్వే జనరల్ మేనేజరుతో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 2003లో సేలం డివిజన్ ఏర్పాటు సమయంలో మదురై డివిజన్ నుంచి పొల్లాచ్చి రైల్వేస్టేషన్‌ను పాలక్కోడు డివిజన్‌తో అనుసంధానించినట్లు గుర్తు చేశారు. దాన్ని నిరసిస్తూ ఆందోళనలు చేపట్టినట్లు వైగో పేర్కొన్నారు.

100 మంది క్రీడాకారులకు ప్రభుత్వోద్యోగం

సైదాపేట, న్యూస్‌టుడే: క్రీడల్లో ఉత్తమంగా రాణించిన 100 మందికి ప్రభుత్వోద్యోగం ఇచ్చేందుకు జాబితా సిద్ధమైనట్లు తెలిసింది. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగావకాశాల్లో 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారు. స్విమ్మింగ్, అథ్లెటిక్స్, రోలర్ స్కేటింగ్, కబడ్డీ, స్క్వాష్, కర్రసాము తదితర పలు రకాల అంశాల్లో రాణించిన వారిని తీసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి ఇటీవల ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రకటన కూడా చేశారు. ఆ ప్రకారం జాబితా సిద్ధమైనట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

వైద్య విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి మంత్రి గైర్హాజరు

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం 37వ స్నాతకోత్సవం నగరంలోని వర్సిటీ రజతోత్సవ ఆడిటోరియంలో గురువారం జరిగింది. కులపతి గవర్నర్ ఆర్.ఎన్.రవి పాల్గొని విద్యార్థులకు పతకాలు, పట్టాలు ప్రదానం చేశారు. ఛండీగఢ్‌లోని పోస్టుగ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ సంచాలకులు డాక్టర్ వివేక్‌లాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ కె.నారాయణసామి, ఇతర ప్రతినిధులూ పాల్గొన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సుబ్రమణియన్ గైర్హాజరయ్యారు. కార్యక్రమానికి రానని ఆయన ముందుగానే ప్రకటించడం గమనార్హం.



పట్టా ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి


చెన్నై మెరినా బీచ్‌లో నిర్వహించిన ఎయిర్‌షో వీక్షించేందుకు వెళ్లి మృతి చెందిన మడువంగరైకు చెందిన దినేష్‌కుమార్, తిరువల్లికేణికి చెందిన మణి కుటుంబాలకు సీఎం సహాయ నిధి నుంచి తలా రూ.5లక్షల చొప్పున చెక్కులను ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ గురువారం అందించారు. –ఆర్కేనగర్, న్యూస్‌టుడే

పెరిగిన భవానిసాగర్ నీటిమట్టం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: భవానిసాగర్ డ్యామ్ నీటిమట్టం 90.09 అడుగులకు చేరింది. సెకనుకు 7,222 ఘనపుటడుగుల నీరు చేరుతోంది. కొద్ది రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున గండేరుపళ్లం, వరట్టుపళ్లం జలాశయాలు పూర్తి సామర్థ్యాన్ని చేరుకున్నాయి. నీటిమట్టం పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరి కొన్ని దీపావళి ప్రత్యేక రైళ్లు

వడపళని, న్యూస్‌టుడే: దీపావళి పండుగ రద్దీ కారణంగా మరి కొన్ని ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో పేర్కొంది.

● **06021** చెన్నై సెంట్రల్‌లో 29, నవంబరు 2 (శని) తేదీల్లో 19.00కు బయలుదేరి మరుసటి రోజు 03.15కు పోదనూరు చేరుకుంటుంది. ● **06022** కోయంబత్తూరులో 31, నవంబరు 4 (గురు) 00.15కు బయలుదేరి అదే రోజు 09.30కి చెన్నై సెంట్రల్ వస్తుంది. ● **06047** మంగళూరు సెంట్రల్‌లో 29న 19.30కు బయలుదేరి మరుసటి రోజు 10.45కి ఎగ్మూరు చేరుతుంది. ● **06048** ఎగ్మూరులో 30న 12.30కి బయలుదేరి మరుసటి రోజు 05.15 గంటలకు మంగళూరు సెంట్రల్ వెళ్తుంది.

అదనపు హాల్ట్

● **06190, 06191** తిరుచ్చిరాపల్లి-తాంబరం-తిరుచ్చిరాపల్లి 24 నుంచి నడిచే ప్రత్యేక రైలు పాపనాశం, పన్రుట్టి స్టేషన్లలో ఆగుతుందని దక్షిణ రైల్వే ప్రకటించింది.

రవాణా ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు అందించాలి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: విశ్రాంత రవాణా ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు వెంటనే అందించాలని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో... చెన్నైలో కార్ రేస్, మెరినాలో కరుణానిధికి స్మారక మండపం తదితరాలకు నిధులు కేటాయించే డీఎంకే ప్రభుత్వం 25, 30 ఏళ్లు రవాణా సంస్థలో పని చేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు నిధుల కేటాయించటం లేదని ధ్వజమెత్తారు.

కాలువలో మునిగి కార్మికుడు మృతి

ప్యారిస్, న్యూస్‌టుడే: మదురైలో కురిసిన భారీ వర్షాలకు నగరంలో పలు చోట్ల వాననీరు నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో గోరిపాళెయం వద్ద ఉన్న పందల్‌కుడికి చెందిన పాండియరాజన్(57) అనే కార్మికుడు తన ఇంటి వద్ద ఉన్న పందల్‌కుడి కాలువ నిండి చెత్త పేరుకుపోయింది. దీంతో అతను బుధవారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించడానికి యత్నించాడు. అప్పుడు అతను కాలువలో మునిగి పోయాడు. అతని స్నేహితులు కాలువలో దిగి అతని కోసం గాలించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది గాలించి పాండియరాజన్ మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా రేషన్ దుకాణం సిబ్బంది..

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి సమీపంలోని బాగూర్‌కు చెందిన పచ్చై (56) రేషన్‌దుకాణ సిబ్బందిగా ఉన్నాడు. ఇతనికి అదే ప్రాంతానికి చెందిన ఒక మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడు. ఇదిలా ఉండగా కొడైకెనాల్‌కు వెళ్లి వచ్చిన పచ్చై బుధవారం ఆ మహిళ ఇంటికి వెళ్లాడు. రాత్రి ఆ ఇంటి వాకిట్లో తలపై తీవ్రగాయాలతో రక్తపుమడుగులో పడి ఉన్నాడు. వెంటనే బంధువులు చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్నం వేధింపులతో మహిళ ఆత్మహత్య

ప్యారిస్, న్యూస్‌టుడే: వరకట్న వేధింపుల కారణంగా నూతన వధువు ఆత్మహత్య చేసుకున్న స్థితిలో ఆమె అత్త అరెస్టుకి భయపడి ఆత్మహత్యకు యత్నించిన ఘటన కన్నియాకుమరిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కన్నియాకుమరి జిల్లా సుసీంద్రంకు చెందిన కార్తీక్ కొట్టారంలో ఉన్న విద్యుత్తు బోర్డు కార్యాలయంలో అధికారిగా పనిచేస్తున్న అతనికి మార్చి 21న కోయంబత్తూరుకు చెందిన శ్రుతి (24)తో వివాహమైంది. వివాహం సమయంలో అమ్మాయి ఇంటి తరపున 45 సవర్ల బంగారం, రూ.5 లక్షల నగదు, పెద్ద మొత్తంలో వెండి వస్తువులు కట్నంగా ఇచ్చారు. ఈ నేపథ్యంలో కార్తీక్ తల్లి షణ్ముగవల్లి మూడు నెలల నుంచి అదనంగా వరకట్నం తీసుకురావాలని శ్రుతిని చిత్రహింసలకు గురిచేస్తోంది. వేధింపులు తాళలేక మంగళవారం శ్రుతి ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు ముందు ఆమె తన తల్లికి వాయిస్ మేసేజ్ పంపింది. అందులో తన ఆత్మహత్యకు కారణం తన అత్త అని తెలిపింది. దీంతో వెంటనే ఆమె తల్లిదండ్రులు కన్నియాకుమరికి వచ్చి వరకట్నకోసం తన కుమార్తెను అత్తింటివారు హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో బుధవారం షణ్ముగవల్లి ఆత్మహత్యకు యత్నించింది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యార్థులకు కత్తిపోట్లు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: తేని జిల్లా బంగ్లామేడుకు చెందిన రాహుల్ నవ్ఇండియా ప్రాంతంలోని ప్రైవేటు కళాశాలలో బీకాం చదువుతున్నాడు. ఇతనికి అదే కళాశాలలో బీబీఏ మొదటి సంవత్సరం చదివే తిరునెల్వేలికి చెందిన విద్యార్థి రాహుల్‌గాంధీతో పాత కక్షలు ఉండేవి. ఈ క్రమంలో రాహుల్‌గాంధీ బుధవారం రాత్రి రాహుల్ గదికి వెళ్లి గొడవకు దిగి కత్తితో దాడి చేయడంతో రాహుల్, అతని స్నేహితులు పాండ్యన్, రోషన్‌రాజా తీవ్రంగా గాయపడ్డారు. సహ విద్యార్థులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. పోలీసులు రాహుల్‌గాంధీ, కెవిన్, సతీష్ సహా ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోసం కేసులో ఫైనాన్స్ కంపెనీ యజమాని అరెస్టు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తంజావూర్ జిల్లా కుంభకోణం ధనలక్ష్మినగర్‌కు చెందిన చంద్రమోహన్(48) స్థానిక కొత్త బస్టాండ్ వద్ద సూర్య ఫైనాన్స్ సర్వీస్ పేరిట ఫైనాన్స్ కంపెనీని నడుపుతున్నాడు. ఇందులో తిరువిడైమరుదూర్‌కు చెందిన మురళి రూ.7.5 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. గడువు ముగిసినా వడ్డీ నగదు ఇవ్వకపోవడంతో మురళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు కంపెనీ యజమాని చంద్రమోహన్‌ను బుధవారం అరెస్టు చేశారు. చంద్రమోహన్ చాలా మందికి నగదు ఇవ్వకుండా మోసం చేసినట్లు గుర్తించారు. అతనిపై 40 మందికి పైగా బాధితులు ఫిర్యాదు చేశారు.

దాడి, నగదు చోరీ కేసులో దంపతులు..


ప్రవీణ, రాజు

ప్యారిస్, న్యూస్‌టుడే: రాణిపేటకు చెందిన వినోద్‌కుమార్ చెన్నైలో ఉంటూ ప్రైవేటు కాల్ ట్యాక్సీ సంస్థలో డ్రైవరుగా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున ప్రవీణ యాప్‌లో కారును బుక్ చేసుకోవడంతో వినోద్‌కుమార్ మణలి వద్ద ఉన్న జగదీశ్ నగర్ ప్రాంతానికి వెళ్లాడు. అప్పుడు ప్రవీణ తన భర్త రాజు, అతని స్నేహితుడు మరో రాజును కారులో ఎక్కించి అక్కడి నుంచి వెళ్లిపోయింది. కారులో ప్రయాణించిన వారిద్దరు శాస్త్రినగర్ వద్ద కారును ఆపమనడంతో వినోద్‌కుమార్ ఆపాడు. అప్పుడు వారిద్దరు అతనిపై దాడిచేసి, అతని వద్ద ఉన్న నగదు దోచుకుని పారిపోయారు. ఈ విషయమై వినోద్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్‌కేబీ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి రాజు, ప్రవీణను అరెస్టు చేశారు. బుధవారం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

మత్తుపదార్థం తయారీకి యత్నించిన యువకులు..

ప్యారిస్, న్యూస్‌టుడే: పోలీసులకు అందిన సమాచారం మేరకు చెన్నై కొడుంగైయూర్‌లో మత్తుపదార్థాలను తయారు చేస్తున్న ప్రవీణ్ ప్రనవ్, కిషోర్, జ్ఞానపాండియన్, నవీన్, ధనుష్, ఫ్రాన్సిస్, అరుణ్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ప్రవీణ్ ప్రణవ్, నవీన్, కిషోర్ ఇంజినీరింగ్ పట్టభద్రులు, ధనుష్ బీఎస్సీ, జ్ఞానపాండియన్ బీఎస్సీలో గోల్డ్‌మెడల్ సాధించారు. వారి వద్ద జరిపిన దర్యాప్తులో ప్రవీణ్, కిషోర్, నవీన్, ధనుష్‌లు నగదు సంపాదించాలన్న ఆశతో అరుణ్ అనే వ్యక్తి నుంచి 250 గ్రాముల మెథాంఫేటమైన్‌ను రూ.3 లక్షలకు కొనుగోలు చేశారు. అది నకిలీదని తెలియడంతో వారే మెథాంఫేటమైన్ తయారు చేయాలని అనుకున్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన జ్ఞానపాండియన్‌తో మెథాంఫేటమైన్ తయారు చేయమని చెప్పారు. కెమికల్ దుకాణంలో కెమికల్స్ కొనుగోలు చేసి ప్రవీణ్ ఇంట్లో ల్యాబ్ నిర్వహించి మెథాంఫేటమైన్ తయారీ విధానాన్ని పరీక్షించారు. వారి నుంచి 245 గ్రాముల మత్తుపదార్థాన్ని, రెండు ల్యాప్‌టాప్‌లు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

హత్యాచారం కేసులో యువకుడికి జీవిత ఖైదు


ప్యారిస్, న్యూస్‌టుడే: బాలికను హత్యాచారం చేసిన యువకుడికి జీవితఖైదు శిక్ష విధిస్తూ తేని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. 2022లో తేని జిల్లాలోని ఓ అంగన్‌వాడి ఎదురుగా ఉన్న ఖాళీ ప్రాంతంలో ఆడుకుంటున్న ఏడేళ్ల బాలికను స్థానికంగా ఉంటున్న 22 ఏళ్ల యువకుడు లైంగిక వేధింపులకు గురి చేశాడు. బాలిక ఈ విషయం తల్లిదండ్రులకు చెబుతానని తెలపడంతో అతను బాలికను అట్ట బాక్సులో పెట్టి నిప్పంటించాడు. బాలిక కేకలు విన్న అంగన్‌వాడి సిబ్బంది, స్థానికులు వెళ్లి చూడగా బాలిక కాలిన గాయాలతో ప్రాణాపాయ స్థితిలో కనిపించింది. వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి యువకుడిని అరెస్టు చేశారు. ఈ కేసు తేని జిల్లా కోర్టులో విచారణ జరిగింది. విచారణ పూర్తయిన స్థితిలో బుధవారం యువకుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. అలాగే బాధిత బాలిక తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల పరిహారం అందించాలని ఉత్తర్వులు ఇచ్చింది.

చోరీకి గురైన 200 సెల్‌ఫోన్ల స్వాధీనం


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్పీ మదివాణన్

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ జిల్లాలో సెల్‌ఫోన్ల చోరీకి సంబంధించి ఎనిమిదో విడతలో 612 ఫిర్యాదులు అందాయి. సీఈఐఆర్ అనే పోర్టల్ ద్వారా రూ.38 లక్షల విలువ చేసే 200 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని జిల్లా ఎస్పీ మదివాణన్ బాధితులకు గురువారం అప్పగించారు. ఇప్పటి వరకు ఏడు విడతల్లో రూ.2.55 కోట్ల విలువ చేసే 1324 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు.

రూ.24 లక్షల విలువైన బంగారం..


స్వాధీనం చేసుకున్న బంగారం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి గురువారం తెల్లవారుజామున సింగపూర్ నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా విమాన ప్రయాణికులను కస్టమ్స్ విభాగ అధికారులు తనిఖీ చేశారు. ఓ ప్రయాణికుడి వద్ద 179 గ్రాముల బంగారు చెయిన్, బంగారు ముక్కలు దుస్తుల్లో దాచి తెచ్చినట్లు గుర్తించారు. మరో ప్రయాణికుడి వద్ద 117 గ్రాముల బంగారాన్ని అక్రమంగా తెచ్చినట్లు గుర్తించారు. వారిద్దరి నుంచి రూ.24 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు మదురైకు చెందిన మహేష్(49), శివగంగైకు చెందిన పాండి(46)గా గుర్తించారు. అరెస్టు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఆరు కిలోల గంజాయి..

క్రైం కార్నర్


వివరాలు తెలియజేస్తున్న సీఐ మద్దయ్యాచారి, పోలీసులు

పాకాల, న్యూస్‌టుడే: స్థానిక రైల్వే కూడలిలో గురువారం ఓ వ్యక్తి నుంచి పాకాల పోలీసులు రూ. 72 వేల విలువైన ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గురువారం సీఐ మద్దయ్యాచారి వివరాలను వెల్లడించారు. స్థానిక రైల్వే జంక్షన్‌లో పోలీసులు నిఘాలో ఉండగా తమిళనాడు రాష్ట్రం కడలూరు జిల్లా చొక్కలూరుపాలెం గ్రామానికి చెందిన శరవణ శంకర్ అనే వ్యక్తి సంచితో బయటకు వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడన్నారు. పట్టుకుని విచారించగా విశాఖపట్నం నుంచి చెన్నైకి తీసుకెళ్తున్నట్లు, ఇందుకుగాను తనకు లీనా అనే వ్యక్తి రూ.15 వేలు ఇస్తున్నట్లు అంగీకరించాడన్నారు. నిందితునిపై కడలూరు జిల్లాలో రెండు గంజాయి కేసులున్నాయన్నారు. ఏఎస్సై వెంకటరత్నం నాయుడు, హెడ్‌కానిస్టేబుల్ సోమశేఖర్, కానిస్టేబుళ్లు రవి, గౌరీశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కోవై సమీపంలో బస్సు దగ్ధం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోవై నుంచి పొల్లాచ్చికి గురువారం ఉదయం ఓ ప్రభుత్వ బస్సు 30 మంది ప్రయాణికులతో బయలు దేరింది. ఒత్తక్కాలు ప్రాంతంలో బస్సు వెనుక భాగం నుంచి మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవరు బస్సు ఆపిన వెంటనే ప్రయాణికులు బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది సుమారు గంట సేపు శ్రమించి మంటలను అదుపు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


మంటల్లో బస్సు

పట్టపగలే నగదు, నగలు చోరీ

అరక్కోణం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలో మూసి ఉంచిన ఇంటి తలుపు తాళాలను పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు నగలు, నగదును చోరీ చేసిన సంఘటన గురువారం అరక్కోణం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణ సమీపంలోని వెంకటేశపురం ట్రాన్స్‌ఫార్మ్ మూడో వీధికి చెందిన మంగై చెన్నై సమీపంలోని ఆవడి వద్ద ఓ కేంద్ర ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్నారు. అక్కడే తన కుమార్తె వద్ద ఉంటూ విధులకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంటి తలుపు తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు విషయాన్ని మంగైకు తెలియజేశారు. దీంతో ఆమె వెంకటేశపురానికి వచ్చి తన ఇంట్లో పరిశీలించగా బీరువాలో భద్రపరచిన మూడున్నర సవర్ల నగలు, రూ.15 వేల నగదు చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

● **ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** తిరుప్పూర్ జిల్లా ఉడుమలై సమీపంలోని శేఖర్‌పురం ప్రాంతానికి చెందిన దండపాణి సహకార సంఘంలో ఆడిటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను గురువారం అనారోగ్యం కారణంగా ఆస్పత్రికి వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి చేరుకున్నారు. అప్పుడు ఇంటికి వేసిన తాళాలు పగలగొట్టి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా 27 సవర్ల నగలు, రూ.15 వేల నగదు, వెండి వస్తువులతో పాటు మొత్తంగా రూ.20 లక్షల విలువైన నగదు, నగలు చోరీ అయినట్లు గుర్తించాడు. దీని గురించి దండపాణి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రతిపక్షాల తీరు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రాతినిధ్యం జనాభా ప్రాతిపదికన ఉండకూడదన్నారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ కేవలం జనాభాకు సంబంధించినది కాకూడదని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు, తుఫాను, వరదలతో ప్రజలు ఎలాంటి నష్టం లేదన్నారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు విమర్శించాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. నటుడు విజయ్ పార్టీ మహానాడు విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. మహానాడుకు తనకు పిలుపు రాలేదన్నారు.

తనిఖీలు ముమ్మరం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా రైళ్లలో బాణసంచా తరలించడాన్ని నిరోధించడానికి కోయంబత్తూరు రైల్వేస్టేషన్‌లో పోలీసులు ముమ్మరంగా తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈనెల 28 నుంచి 31 వరకు కోవై నుంచి వివిధ ప్రాంతాలకు 1100 బస్సులు నడపనున్నారు. దీంతో బసాండుల్లోనూ పోలీసులు తనిఖీలు చేపట్టారు.

కోర్టుకు హాజరైన మంత్రి సెంథిల్ బాలాజీ

ప్యారిస్, న్యూస్‌టుడే: ఉద్యోగం పేరుతో మోసానికి పాల్పడిన కేసులో మంత్రి సెంథిల్ బాలాజీ చెన్నై ప్రత్యేక కోర్టులో హాజరయ్యారు. 2011-15 అన్నాడీఎంకే హయాంలో రవాణాశాఖ మంత్రిగా ఉన్న సెంథిల్ బాలాజీ రవాణాశాఖలో ఉద్యోగం ఇప్పిస్తారని పలువురి వద్ద నగదు తీసుకొని మోసానికి పాల్పడినట్లు చెన్నై సెంట్రల్ క్రైం బ్రాంచ్‌లో కేసు నమోదైంది. కేసు ఎంపీ, ఎమ్మెల్యేల కేసులు విచారించే ప్రత్యేక కోర్టులో గురువారం విచారణకు వచ్చింది. సెంథిల్ బాలాజీ, ఇతరులు హాజరయ్యారు. కేసులో 2,222 మందికిపైగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తొలుత 100 మందికి సమన్లు పంపారు. వారిలో గురువారం విచారణకు హాజరుకాని వారికి మళ్లీ సమన్లు పంపాలని న్యాయమూర్తి ఉత్తర్వులు ఇచ్చారు. విచారణ నవంబరు 25కి వాయిదా వేశారు.

వీఐపీ దర్శన టిక్కెట్‌లో మోసం

పుదుచ్చేరి సీఎం కార్యాలయంలో విచారణ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వీఐపీ దర్శన టిక్కెట్ పొందిన పద్మనాభన్ అనే వ్యక్తి నెల్లూరుకు చెందిన డాక్టర్ కుటుంబానికి రూ.23 వేలకు విక్రయించాడు. దర్శనానికి అవసరమైన ఏర్పాట్లు చేయకపోవడంతో వారు తితిదే విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన తిరుమల ఒకటో పట్టణ పోలీసులు పద్మనాభన్‌ను పుదుచ్చేరి సీఎం కార్యాలయానికి తీసుకొచ్చి విచారించారు. అతను సీఎం కార్యాలయంలో వీఐపీ దర్శనానికి సిఫార్సు లేఖ తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. భక్తుల నుంచి ఎక్కువ మొత్తం తీసుకున్నట్లు గుర్తించారు. నిందితుడిని తిరుపతికి తీసుకొచ్చి విచారిస్తున్నారు.